అది విన్న తక్షణ మాట్లాడే ఆర్థర్ హెయిలీ చెప్పాడు.

"తప్పు ఆ రచయితది కాదు. గ్రంథ చోర్యాన్ని ప్రోత్సహించిన ఎడిటర్స్‌ది."

"మన నవలని అలా యథాతథంగా అనువదించకుండా స్వంత బుర్రని వుపయోగించిన ఆ రచయితది ఇంకా తప్పు" నవ్వుతూ చెప్పాడు ఇర్వింగ్ వెలెస్.

## సస్పెన్స్

గోదావరి నదీతీరం.

తెల్లరంగులో హుందాగా, అందంగా వున్న ఆ పడవ దగ్గరకి నడిచాడు.

"ఆవతలి గట్టు చేరుకోవాలి. ఏం తీసుకుంటావ్" అడిగాను.

"రెండ్రూపాయలండి" చెప్పాడు.

"నా పడవ రూపాయిన్నరకే వస్తుంది"

ఆ మాటలన్న వ్యక్తివైపు చూసాను. అతనూ పడవనడిపే వాడే వని దుస్తుల్నిబట్టి తెల్సిపోతుంది.

"అసలు రేటు రూపాయేనండి. వాడి పడవ ఎవరూ ఎక్కరు కాబట్టి మీలాంటి కొత్త పేసెంజరు వచ్చినప్పుడల్లా రెండు రూపాయలు చెపాడండి అని తానా పడవే ఎక్కడంతో ఓ అర పెంచానండి" చెప్పాడా రెండో పడవవాడు.

"ఎందుకు వాడిపడవ ఎక్కరు?" అడిగాను ఆసక్తిగా.

ఆ పడవ మనిషి ముఖంలో "నేను తన పడవ ఎలాగూ ఎక్కను ఎందుకు ఈయనతో మాటలు' అన్నభావం ప్రస్ఫుటించింది. నా ప్రశ్నకి సమాధానం చెప్పకుండా తన పడవ దగ్గరకి నడక సాగాడు.

నేను వాడిని ఆపి మళ్ళీ ప్రశ్న వేశాను.

"దారిలో చెపొతండయితే"

వాడు తన పడవదగ్గరకి వెళ్ళిపోయాడు.

"వాడుట్టి అబద్దాలకోరు బాబూ! వాడి మాటలు నమ్మకండి" చెప్పాడు రెండు రూపాయలు చెప్పిన పడవవాడు.

"నాలో సహజంగా వుండే ఆసక్తి అధికం అవడంతో తెల్ల పడవ ఎక్కకుండా ఆ రెండో పడవ ఎక్కాను. వాడు చిన్నగా ఈలవేస్తూ తెడ్డు వేస్తున్నాడు.

"దార్లో చెపానన్నావ్" అడిగాను వాణ్ణి.

వాడు నా వంక చూడకుండానే చెప్పాడు.

"ఎందుకు లెండి"

"ఫర్వాలేదు చెప్పు ఆ తెల్ల పడవ ఎందుకెక్కరు?"

"ఎందుకులెండి"

"చెపానన్నావుగా" అని గదమాయించాను గట్టిగా.

"ఎందుకనో అది చిల్లు పడకుండానే మునిగిపోతుందండి ఇప్పటి దాకా ఇరవై మంది దాకా మునిగారు. పదమూడు మంది కొట్టుకుపోయి చచ్చారు. ఏడుగురికి ఈత వచ్చు కాబట్టి బతికారు.

నా గుండె ఝల్లుమంది.

"చిల్లు పడకుండా ఎలా మునుగుతుంది?"

"చెప్పాలంటే అదో పెద్ద కథ లెండి"

వాడి డబ్బులు చెల్లించి అవతలి గ్రామంలో నా పని చూసుకుని మళ్ళా సాయంత్రానికల్లా పడవల రేవుకి చేరుకున్నాను. ఆ పడవవాడు లేడు. వాడు అవతలి వడ్డునుంచి వచ్చే దాకా ఆగి, మళ్ళీ వాడి పడవే ఎక్కి అడిగాను.

"ఆ తెల్ల పడవ చిల్లుపడకుండా ఎందుకు మునుగుతుంది?"

"అదెప్పుడు మునిగిందండీ?" గలగలా నవ్వాడు వాడు నా వంక అల్లరిగా చూస్తూ.

"పొద్దున నువ్వే చెప్పావుగా?"

"అలా చెప్పబట్టే నా పడవెక్కారు ఎందుకు మునిగిందో తెలుసుకుందామని తమరు నా కోసం ఆగి మరీవచ్చి నా పడవే ఎక్కారు. అలా ఎక్కుతారని తెలిసే చిన్న కథ అల్లానంతే. ఆ తెల్లపడవ మా అయ్యదే నిజానికి" తెడ్డువేస్తూ చెప్పాడు.

అప్పుడు జరిగిందా సంఘటన ఆ దృశ్యం చూసి అతని రోమాలు నిక్కబొడుచుకుని స్థాణువుల్లా నిల్చుండిపోయాడు.

సీరియల్ నవలల్లో ప్రతి సంచికలో అలాటి ఆఖరి వాక్యాలు రచయితలు ఎందుకురాస్తారో నాకాక్షణం అర్థమైంది.

# అభిమాని

రచయిత అయ్యాక చాలామంది రచయితలకి జీవితమంతా థ్రిల్లే. కథని వేసుకుంటున్నామంటూ వచ్చే అచ్చయిన కార్డు మొదటి థ్రిల్. ఆ కథ అచ్చులో చదువుకోవడం మరో థ్రిల్. దాన్ని మిత్రులు, బంధువులు బావుందని పొగిడితే ఇంకో థ్రిల్. కొద్ది కాలం పోయాక దాన్ని కన్నడంలోకో, హిందీలోకో అనువదిసామంటూ అనువాదకురాలినించి వచ్చే ఉత్తరం చెప్పలేని థ్రిల్. పరభాషా పత్రిక పంపే చెక్ రచయితకే కాక రచయిత భార్యకి కూడా థ్రిల్ కలిగిస్తుంది. రచయితగా ఎక్కువ మంది స్థిరపడటానికి ప్రయత్నించక పోవటంతో కొద్ది సంవత్సరాల్లో రచనలు, మానేస్తూంటారు.